క్లుప్తంగా

ఉపాధి హామీ పనులపై ఆడిట్



మాట్లాడుతున్న డీవీవో లవరాజు

పాతపట్నం: మండలంలోని 34 గ్రామ పంచాయతీల పరిధిలో 2023–24 ఏడాదిలో చేపట్టిన రూ.20.63 కోట్ల పనులకు సంబంధించి సోషల్ ఆడిట్ నిర్వహించనున్నట్లు డీవీవో బి.లవరాజు తెలియజేశారు. స్థానిక వెలుగు కార్యాలయంలో ఏపీడీ పి.రాధ ఆధ్వర్యంలో అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పథకం పనుల ఆడిట్‌పై సమీక్ష సమావేశం శనివారం నిర్వహించారు. ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో చేపట్టిన పనులతో పాటు ఐటీడీఏ, పంచాయతీరాజ్ శాఖల సమన్వయంతో చేపట్టిన పనులు కూడా ఆడిట్ చేయడం జరుగుతుందన్నారు. ఒక ఎస్ఆర్పీ, 8 మంది డీఆర్పీలు, 8 మంది వీఎస్ఏలు ఆడిట్‌కు వచ్చారన్నారు. సమావేశంలో ఏపీవో సురేష్, జేఈ ప్రసాదరావు, ఏవో రాజమోహనరావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల వివరాలు ఇవ్వాలి



మాట్లాడుతున్న ఎంఈవో రాంబాబు

హిరమండలం: మండలంలో శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల వివరాలను అందించాలని ఎంఈవో కె.రాంబాబు సూచించారు. స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో సీఆర్పీలు, ఎమ్మార్సీ సిబ్బందితో సమీక్ష సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న పాఠశాలలు గుర్తించాలన్నారు. ఈనెల 22 నుంచి శిక్షసప్త కార్యక్రమాలు నిర్వహించేలా చూడాలన్నారు. అలాగే ఈనెలలో జరగనున్న ఆధార్ క్యాంప్ సర్వీసులను వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని కోరారు.

పంటకోత ప్రయోగం



పంటకోత ప్రయోగం నిర్వహిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

కొత్తూరు: ప్రకృతి వ్యవసాయంలో భాగంగా వరిసాగు చేయనున్న పంట పొలాల్లో సాగు చేస్తున్న నవధాన్యాల సాగుపై మాకవరంలో పంటకోత ప్రయోగాలను ఎంటీ సూర్యనారాయణ శనివారం నిర్వహించారు. మాకవరం గోవిందరావు సాగు చేస్తున్న నవధాన్యాల పంటలో ప్రయోగం నిర్వహించగా 36 కిలోల పచ్చిరొట్ట ఎరువు దిగుబడి వచ్చిందని సూర్యనారాయణ తెలిపారు. ఎకరా వరి పంటకు 5,382 కిలోల పచ్చిరొట్ట ఎరువులు అవసరమన్నారు. 18 రకాల విత్తనాలతో సాగు చేస్తున్న పచ్చిరొట్టతో పంట పండించడం వలన రైతులకు ఎన్నో ప్రయోజనాలు పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం ఎస్ఎఫ్ఏ ముసలయ్య, సిబ్బంది చిన్నమ్మి, ధనలక్ష్మి, వెంకటరావు, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

అండర్ పాసేజ్ వద్ద అవస్థలు!



నడగాం వద్ద అండర్ పాసేజ్‌లో చేరిన నీరు

నరసన్నపేట: వర్షం పడితే రైల్వే అండర్ పాసేజ్‌ల వద్ద వాహనదారులతో పాటు స్థానికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. వీటివద్ద నీరు అధికంగా చేరడంతో రాకపోకలు నిలిచి పోతున్నాయి. మండల పరిధిలోని నడగాం, బాడాం, చిక్కాలవలసల వద్ద ఉన్న అండర్ పాసేజ్‌ల వద్ద ఈ పరిస్థితి నెలకుంది. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నీరు అధికంగా అండర్ పాసేజ్‌ల కింద చేరడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. దీనిపై ఆమదాలవలస రైల్వే స్టేషన్ ఏఈఎన్ బీవీఎస్ఎన్ మూర్తి స్పందిస్తూ పాసేజ్‌ల్లో చేరిన నీటిని ఆయిల్ ఇంజన్లతో తొలగించే చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

'ప్రజల ప్రాణాలతో అధికారుల చలగాటం'

ఆమదాలవలస: ప్రజల ప్రాణాలతో పురపాలక సంఘ అధికారులు చలగాటమాడుతున్నారని సిటిజన్ ఫోరమ్ ప్రధాన కార్యదర్శి బొడ్డేపల్లి మోహనరావు అన్నారు. శనివారం పట్టణంలోని ఆయన స్వగృహంలో విలేకరులతో మాట్లాడుతూ పట్టణంలో కూరగాయల మార్కెట్ కట్టి చాలా సంవత్సరాలైనా వినియోగంలోకి తీసుకురాకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. కూరగాయల మార్కెట్ వద్ద అపారిశుద్ధ్యం రాజ్యమేలుతుండడంతో డెంగీ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు.



పాతపట్నం: ఉధృతంగా పారుతున్న మహేంద్రతనయ నది



జలుమూరు: కొమనాపల్లి వద్ద వంశధార ప్రవాహం

ముంచెత్తిన వాన

అల్పపీడనం ప్రభావంతో గత మూడు రోజులుగా జిల్లావ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురిశాయి. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పంట పొలాల్లోకి వర్షపు నీరు చేరడంతో వరి నారులు నీట మునిగాయి. పలుచోట్ల రహదారులు కోతకు గురవ్వడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. విద్యుత్ వైర్లపై చెట్లు కూలడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అధికారులు హుటాహుటిన స్పందించి ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నారు.

- సాక్షి నెట్‌వర్క్



పాతపట్నం: కాగువాడ వద్ద నీట మునిగిన వరివెదలు



బూర్జ: పనుకుపర్త పంట పొలాలు పరిశీలిస్తున్న అధికారులు



నరసన్నపేట: బొరిగివలసలో పొలాలను పరిశీలిస్తున్న అధికారులు



హిరమండలం: జిల్లోడిపేట గ్రామం వద్ద మహేంద్రతనయ నదిని పరిశీలిస్తున్న అధికారులు



నరసన్నపేట: భవానీపురంలో రోడ్డుపై విరిగిన చెట్టు



ఎల్.ఎన్.పేట: కోవిలాం వద్ద ఏబీ రోడ్డుపై వరదనీటి ప్రవాహం



కొత్తూరు: పాలకొండ రోడ్డు మీద నుంచి ప్రవహిస్తున్న కాలువ నీరు



ఎల్.ఎన్.పేట: కోవిలాం వద్ద నీట మునిగిన పొలాలు



ఎల్.ఎన్.పేట: తురకపేట వద్ద నీట మునిగిన పొలాలు



నరసన్నపేట: మడపాం వద్ద నీట మునిగిన వరివెదలు



నరసన్నపేట: కోమర్తి వద్ద నీట మునిగిన వరిపైరు



ఎల్.ఎన్.పేట: దబ్బపాడు వద్ద కడపలవాని గెడ్డపై వరదనీరు



మెళియాపుట్టి వద్ద మహేంద్ర తనయ



సారవకోట: బద్రి గ్రామంలో కూలిన భారీ వృక్షం



జలుమూరు: గుగ్గిలి వద్ద నీట మునిగిన పంట పొలాలు



జలుమూరు: గుగ్గిలి వద్ద నీట మునిగిన పంట పొలాలు



సరుబుజ్జిలి: బుడ్డివలస వద్ద ముంపుబారిన పంట పొలాలు



కొత్తూరు: త్రినాథ స్వామి ఆలయం వద్ద ప్రవహిస్తున్న కాలువ నీరు

23 నుంచి ప్రత్యేక ఆధార్ క్యాంపులు

నరసన్నపేట: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలో ఈనెల 23 నుంచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రామకృష్ణ తెలిపారు. 23న మడపాం, ప్రభుత్వ జూనియర్ కళాశాల నరసన్నపేట, ఉర్లాం, బాడాం, నరసన్నపేట బోర్డు స్కూల్స్‌లో ఆధార్ క్యాంపులు నిర్వహిస్తామన్నారు. అలాగే 24న మాకివలస, నరసన్నపేట బోర్డు స్కూల్స్‌లో, 25న నరసన్నపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బాడాం, ఉర్లాం ప్రభుత్వ జూనియర్ కళాశాల, మాకివలసల్లో నిర్వహిస్తామన్నారు. 26న సత్యవరం, కంబకాయ, సుందరాపురం, నరసన్నపేట బాలికోన్నత పాఠశాలల్లో, 27న బొరిగివలస, సుందరాపురం, ఉకలాం, కంబకాయ, సత్యవరం ఉన్నత పాఠశాలల్లో ఆధార్ క్యాంపులు నిర్వహిస్తామని, విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

ఎల్.ఎన్.పేట: మండల కేంద్రంలోని రోటరీనగర్‌లో వరద ముంపు బాధితులకు జనసేన పార్టీ నాయకురాలు కొరికాన భవానీ నిత్యవసర సరుకులను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భవానీ మాట్లాడుతూ ఇటీవల వర్షాలకు రోటరీనగర్ ముంపునకు గురికావడంతో కుటుంబాలు రోడ్డున పడ్డారన్నారు. దీంతో వారికి సేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కె.రామశంకరరావు, కుప్పిలి రాంబాబు, రామారావు, నగేష్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నాగభూషణరావు వర్ధంతి నేడు

కొత్తూరు: పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి భర్త దివంగత నాగభూషణరావు వర్ధంతి స్థానిక కలమట రమేష్ కల్యాణ మండపంలో శనివారం నిర్వహించనున్నట్లు జేఏసీ కన్వీనర్ గండివలస ఆనందరావు, కొత్తూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల చైర్మన్ వడమ శ్రీనివాసరావులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు హాజరవ్వాలని కోరారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి



పాతపట్నం: మాట్లాడుతున్న ఎంపీడీవో రామకృష్ణరాజు

పాతపట్నం: తుఫాన్‌పై మండల స్థాయి అధికారులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ వై.ఎస్.వి.వి.ప్రసాదరావు అధికారులను ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులు, సెక్రటరీలు, వీఆర్వోలతో తుఫాన్ ప్రభావంపై శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నదితీర ప్రాంతాలైన సరాలి, చంగుడి, కాపు గోపాలపురం, హరిజన గోపాలపురం గ్రామస్తులను ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంచాలన్నారు. ఎంపీడీవో రామకృష్ణరాజు మాట్లాడుతూ గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబల్లే అవకాశం ఉందని హెచ్చరించారు. సమావేశంలో డీటీ ప్రసాదరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ కల్యాణ్ రామ్, ఎంఈవో శ్రీధర్, తిరుమలరావు, జేఈలు ప్రసాదరావు, గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.



సారవకోట: అధికారులతో సమీక్షిస్తున్న తహసీల్దార్ భాగ్యవతి

సారవకోట: తుపాను కారణంగా కురుస్తున్న వర్షాలపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ భాగ్యవతి సూచించారు. శనివారం ఆమె తహసీల్దార్ కార్యాలయంలో వివిధ శాఖల మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తుపానుతో ఎటువంటి నష్టం వాటిల్లినా సమాచారం అందజేయాలని స్పష్టం చేశారు. ఆమెతో పాటు ఎంపీడీవో రాంబాబు ఉన్నారు.

'అధికారులు అందుబాటులో ఉండాలి'

కొత్తూరు: ప్రస్తుతం విరివిగా వర్షాలు కురుస్తుండడంతో అధికారులంతా అందుబాటులో ఉండాలని తహసీల్దార్ ఎంవీ ప్రసాదరావు, ఎంపీడీవో త్రివిక్రమరావు, ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ రాంబాబులు ఆదేశించారు. ఈ మేరకు మండల కేంద్రంలో సమావేశాన్ని శనివారం నిర్వహించారు. నదుల్లో వరద పరిస్థితిని ఎప్పటికప్పుడు నివేదించాలన్నారు. గ్రామాల్లోని అన్ని మంచినీటి ట్యాంకుల్లోకి నీరు ఎక్కించాలని చెప్పారు. శిథిలమైన ఇళ్లలో ఉన్నవారిని సురక్షితమైన ఇళ్లలోకి పంపించాలని సూచించారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఇరిగేషన్ ఏఈ ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.



కొత్తూరు:మాట్లాడుతున్న ఈవోపీఆర్డీ రాంబాబు